సాక్షి
ఆదిలాబాద్
గురువారం : 13 : ఏప్రిల్ : 2023



భూసారంతో అధిక దిగుబడి
భూసార పరీక్షలు నిర్వహించి వాతావరణ పరిస్థితులకు తగిన పంటలను సాగుచేస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో▸



మరోసారి తెరపైకి 'కుప్పి'
ఎన్నికల ఏడాదిలోనైనా కుప్పి ప్రాజెక్ట్ నిర్మాణానికి ముందడుగు పడుతుందా.. అంటే బీఆర్ఎస్ వర్గాల నుంచి అవుననే సంకేతాలు వస్తున్నాయి. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
42.0 /27.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కనిపిస్తుంది. సాయంత్రం పలుచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:30	శుక్ర : 4:42

బక్కచిక్కుతున్న బాల్యం



ఇక్కడ కనిపిస్తున్న చిన్నారి ఆదిలాబాద్ పట్టణం బొక్కల్‌గూడ కాలనీకి చెందిన నైర. వయసు మూడేళ్లు. పోషకాహార లోపంతో ఎదుగుదల లోపించింది. తరచూ అనారోగ్యం బారిన పడుతుంది. పట్టణ ఆరోగ్యకేంద్రంలో వైద్యం కోసం వెళ్లగా రిమ్స్‌లోని ఎన్ఆర్సీ సెంటర్‌కు రిఫర్ చేశారు.



ఈ చిన్నారి పేరు ప్రసాద్. ఇచ్చోడ మండల కేంద్రం. వయసు ఐదేళ్లు ఉన్నా ఎదుగుదల లోపించింది. అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లగా ఎన్ఆర్సీ సెంటర్‌కు పంపించారు. ఈ కేంద్రంలో చిన్నారులకు పోషకాహారం అందజేస్తున్నారు. బరువు పెరిగిన తర్వాత తిరిగి ఇంటికి పంపుతారు. జిల్లాలో ఇలాంటి చిన్నారులు వేల సంఖ్యలోనే ఉన్నారు.



ఎన్ఆర్సీ సెంటర్లో చిన్నారికి పౌష్టికాహారం తినిపిస్తున్న తల్లి

- చిన్నారుల్లో తీవ్ర పోషకాహార లోపం
- గర్భిణులను వేధిస్తున్న రక్తహీనత
- ఆగని మాతా శిశు మరణాలు
- నెరవేరని ప్రభుత్వ పథకాల లక్ష్యం

ఆదిలాబాద్‌టౌన్: పోషకాహార లోపంతో బాల్యం బక్కచిక్కుతోంది. పేదరికంలో మగ్గుతున్న వారి కోసం పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు మాత్రం కానరావడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిత్యం చేపడుతున్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు కోడిగుడ్లు, బాలామృతం, పాలు తదితర ఆహార పదార్థాలు అందిస్తున్నా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో బాలింతలు, చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నారు.

రక్తహీనతతో నష్టం..
గర్భిణుల్లో మూడు రకాల రక్తహీనత ఉంటుంది. ఇందులో సాధారణ, మధ్యస్థ, తీవ్రస్థాయిగా నమోదవుతుంది. సాధారణ రక్తహీనత నివారణ కోసం గర్భిణులకు రెండు పూటలు ఐరన్ మాత్రలు అందిస్తారు. మధ్యస్థ బాధితులకు ఎనిమిది వారాల పాటు ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ ఇస్తారు. తీవ్రతరం ఉన్నవారికి రక్తం ఎక్కిస్తారు. అయితే ప్రసవ సమయంలో తీవ్ర రక్తస్రావం జరగడంతో బాలింతలు మరణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నెలలు నిండక ముందే అబార్షన్ అవుతుంది. దీంతో పిల్లలు సైతం తక్కువ బరువుతో పుడతారు. శిశువు కూడా ఆరోగ్యకరంగా ఉండక మృత్యువాత పడే అవకాశలే ఎక్కువ. ప్రసవ సమయంలో గర్భిణికి గుండెపోటు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదని వైద్యులు చెబుతున్నారు. అయితే జిల్లాలో ఎక్కువగా గిరిజన మహిళల్లోనే ఈ సమస్య కనిపిస్తోంది.

ఇదీ పరిస్థితి..
జిల్లాలో ఐదు అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1,256 కేంద్రాలు ఉన్నాయి. ఆరేళ్లలోపు చిన్నారులు 50వేల మంది వరకు ఉన్నారు. 12,250 మంది వరకు గర్భిణులు, బాలింతలు ఉన్నారు. అయితే ఎత్తుకు, వయస్సుకు తగ్గ బరువు లేక తీవ్ర పోషకాహార లోపంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జిల్లాలో 50 శాతం మంది వరకు గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రసవ సమయంలో సకాలంలో రక్తం అందక కొంతమంది మృత్యువాత పడుతున్నారు. నవజాత శిశువులు సైతం వివిధ కారణాలతో మరణిస్తున్నారు.

- జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. చాలామంది గిరిజన మహిళలకు 5 నుంచి 10 శాతం లోపే హిమోగ్లోబిన్ ఉండడంతో ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బందులు తప్పట్లేదు.
- ఝరి పీహెచ్‌సీ పరిధిలో 89 శాతం, హస్నాపూర్‌లో 83, గిమ్మలో 77, పిట్టబొంగరం, గాదిగూడలో 70, గుడిహత్నూర్‌లో 66, నేరడిగొండలో 64, దంతన్‌పల్లిలో 61, సైద్‌పూర్, బేలలో 59, ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరిలక్ష్మీనగర్‌లో 24, తాంసిలో 27, నర్సాపూర్‌లో 29 శాతం గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారు. అయితే ఉట్నూర్, బోథ్ ప్రాంతాల్లో రక్తహీనత శాతం లేదని అధికారుల లెక్కలు చెబుతున్నాయి.
- జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 15,393 మంది గర్భిణులు నమోదై ఉండగా, వీరిలో 7,126 ఎనిమియాతో బాధపడుతుండడం గమనార్హం. 46 శాతం రక్తహీనత ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

చిన్నారుల పోషకాహార లోపం వివరాలు..

నెల	2022 సాధారణ	2022 తీవ్ర	2023 సాధారణ	2023 తీవ్ర
జనవరి	1809	914	702	229
ఫిబ్రవరి	1788	773	680	259
మార్చి	2407	908	613	228
ఏప్రిల్	2433	995	537	218

పోషకాహార లోపం నివారణకు చర్యలు
పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారి ఎదుగుదల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. అంగన్‌వాడీలు గృహ సందర్శన చేస్తున్నారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులను గుర్తించి ఎన్ఆర్సీ సెంటర్‌కు పంపిస్తున్నాం. ఎలాంటి పోషకాహారం తీసుకోవాలనే విషయాలను తెలియజేస్తున్నారు. పోషక వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాం.
– మిల్కా, ఐసీడీఎస్ పీడీ

బాధితులను గుర్తిస్తున్నాం
జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తిస్తున్నాం. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 7,126 మంది ఎనిమియాతో బాధపడుతున్నారు. వీరందరికీ ఐరన్ మాత్రలు అందజేయడం, ఎనిమిది వారాల పాటు ఇంజక్షన్లు ఇవ్వడం, రక్తం ఎక్కించడం వంటివి చేపడుతున్నాం. తల్లి పిలుపు కార్యక్రమం ద్వారా రక్తహీనతతో బాధపడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నాం. వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం. ప్రసవ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం.
– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

భానుడి భగభగ

- జైనథ్‌లో రికార్డు స్థాయిలో 43.3°C
- బయటకు వెళ్లేందుకు జంకుతున్న జనం



జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా ఎన్టీఆర్ చౌక్ నుంచి బస్టాండ్ వెళ్లే రోడ్డు

కైలాస్‌నగర్: జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. ఒక్కసారిగా ఎండతీవ్రత పెరిగింది. జైనథ్ మండలంలో బుధవారం ఏకంగా 43.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటలకే సూర్య ప్రతాపానికి జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, ఎండల నుంచి రక్షణ పొందేందుకు తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. మరోవైపు ఉపాధి, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గొడుగులు, టోపీలు ధరించి ఎండ నుంచి ఊరట పొందుతున్నారు. ఏసీలు, కూలర్ల వాడకం సైతం పెరిగింది.

జిల్లా కేంద్రంలో భిన్నమైన వాతావరణం
జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. రోజంతా ఎండ దంచి కొడుతుండగా, రాత్రి ఆకాల వర్షం కురుస్తోంది. బుధవారం రాత్రి 7.30 నుంచి 8గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పాదాచారులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

16న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష
ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం ఈ నెల 16న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో టి.ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి విద్యార్థుల కోసం జిల్లాలో తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు 1696 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. 7నుంచి పదో తరగతి విద్యార్థులకు ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేయగా, 1235 విద్యార్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఆరో తరగతి విద్యార్థులకు ఉదయం 10నుంచి 12గంటల వరకు, ఏడు నుంచి పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి టెన్త్ 'స్పాట్'
ఆదిలాబాద్‌టౌన్: పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం జిల్లా కేంద్రంలోని జోసెఫ్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత తెలిపారు. జిల్లాకు 1.64లక్షల జవాబు పత్రాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇందు కోసం 677 మంది టీచర్లను నియమించినట్లు తెలిపారు. కేంద్రంలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించినట్లుగా పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

'ఓపెన్' హాల్‌టికెట్ల పంపిణీ ..
ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గెజిటెడ్ ఉన్నత పాఠశాల నం.1లో ఓపెన్ స్కూల్ పదో తరగతి అభ్యర్థులకు ఏప్రిల్ 25 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ నీలాదేవి తెలిపారు. సంబంధిత హాల్ టికెట్లను గురువారం నుంచి ఉదయం 9 నుంచి మ ధ్యాహ్నం 12 గంటల వరకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 2022కు సంబంధించి ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పాసైన వారికి లాంగ్ మెమోలు కూడా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 98660 81088 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మాతా శిశు మరణాల నివారణకు చర్యలు
ఆదిలాబాద్‌టౌన్: మాతా శిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య కార్యకర్తలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. రక్త నిర్ధారణ పరీక్షల్లో పొరపాట్లు జరుగుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని, ఇకపై అలా జరగకుండా ల్యాబ్ టెక్నీషియన్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గర్భిణులకు ఈఎన్‌సీ చెకప్ జరిగేలా ఆశ కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు. టీబీ రోగులపై దృష్టి సారించి వారు చికిత్స పొందేలా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, లెప్రసీ అధికారి శ్రీకాంత్, మలేరియా అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'గొర్రెల' డబ్బులు ఈనెల 18 లోపు జమ చేయాలి



యాదవ కులస్తులతో సమావేశమైన కిషన్

కైలాస్‌నగర్: రెండో విడత గొర్రెల పంపిణీ కోసం ఇప్పటివరకు డబ్బులు జమచేయని గొల్ల, కుర్మలు ఈ నెల 18లోపు జిల్లా కలెక్టర్ పేరిట బ్యాంకులో జమ చేయాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి కిషన్ సూచించారు. గొర్రెల పంపిణీపై వెటర్నరీ వైద్యులు, యాదవ, కురుమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో జిల్లా పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపికైన ప్రతీ లబ్ధిదారుడు తన ఆధార్/నామిని ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను వెటర్నరీ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 15న జిల్లాలోని అన్ని సొసైటీల అధ్యక్షులతో ఉదయం11గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందన్నారు.కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు రఘువీర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మాండ్లు, కురుమ సంఘం అధ్యక్షుడు పోతన్న పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు బలం

- ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్

నేరడిగొండ: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం.. బలగమని ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ అన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన పార్టీ మండల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన హాజరై మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే బాపురావు మాట్లాడుతూ, పార్టీ కన్నతల్లి లాంటిదన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి బోథ్ ఎంపీపీని సస్పెండ్ చేయాలని ఏఎంసీ చైర్మన్ రుక్మన్‌సింగ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, పార్టీ మండల అధ్యక్షుడు శివారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు భోజన్న, నారాయణ సింగ్, మాజీ జెడ్పీటీసీ భీంరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

'డయల్ 100'పై అవగాహన అవసరం

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



సీఐకి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: 'డయల్– 100' నంబర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశం మందిరంలో జిల్లా పోలీసు అధికారులతో బుధవారం నేరాలపై నెలవారీ సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని స్టేషన్లలో 16 వర్టికల్స్ అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఎస్సైలు ప్రతీ గ్రామాన్ని సందర్శించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదును స్వీకరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చే విధంగా చూడాలన్నారు. పట్టణంలో రాత్రి సమయంలో నిరంతర గస్తీ చేపట్టాలన్నారు. గత నెలలో 16 వర్టికల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐ సిబ్బందికి, మూడు నెలల్లో వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన 8 మంది పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసరావు, బి. రాములునాయక్, సి.సమైజాన్ రావు, డీఎస్పీలు వి ఉమేందర్, సీహెచ్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. అంబేద్కర్ జయంతితో పాటు ఉపాధి హామీ పథకం, మిషన్ భగీరథ కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 14న హైదరాబాద్‌లో అంబేద్కర్ భారీ విగ్రహాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరించనున్నారన్నారు. కార్యక్రమానికి జిల్లా నుంచి 15 బస్సులు బయలుదేరనున్నాయని తెలిపారు. ఆయా మండల కేంద్రాల నుంచి ఉదయం 6 గంటలకు బస్సులు బయలుదేరే విధంగా, అలాగే కార్యక్రమ అనంతరం తిరిగి యథావిధిగా గమ్యస్థానాలకు చేర్చే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రతీ బస్సులో ప్రత్యేక అధికారితో పాటు కానిస్టేబుల్, హెల్త్‌అసిస్టెంట్, ఇద్దరు సహాయ సిబ్బందిని నియమించామన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని, జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి వందరోజుల పనిదినాలు కల్పించాలని సూచించారు. వేసవిలో తాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పైపులైన్‌లో లీకేజీలు ఉన్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. అంతకుముందు మండలాల వారీగా ఆయా పనుల పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్షించారు. సమావేశంలో ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో కిషన్, జెడ్పీ సీఈవో గణపతి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీతాకుమారి, ఈడీ శంకర్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఫొటో ఓటరు జాబితా రూపకల్పన
కైలాస్‌నగర్: స్పష్టమైన ఫొటో ఓటరు జాబితా రూపకల్పనకు పకడ్బందీ కార్యచరణ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లతో ఫొటో ఓటరు జాబితా రూపకల్పనపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన ఓటరు నమోదు, సవరణల కోసం వచ్చిన 6,7,8 ఫారాల దరఖాస్తులను బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని తెలిపారు. డూప్లికేట్ ఓటరు కార్డు కలిగిన వారికి నోటీసులు జారీ చేసి తొలగింపు చర్యలు చేపడుతున్నామన్నారు. రెండు లేదా ఎక్కువ ప్రదేశాల్లో నమోదైన ఓటరు వివరాలను ఒకే దగ్గర ఉంచి మిగతా చోట్ల తొలగించేలా, మరణించినా, చిరునామా మారిన వారి వివరాలను విచారించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు రిజ్వాన్ బాషా షేక్, ఎన్.నటరాజ్, ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవోలు రమేశ్ రాథోడ్, సురేష్, ఎన్నికలవిభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లు వేగవంతం చేయాలి
ఆదిలాబాద్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో విగ్రహావిష్కరణ ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలిరానున్న కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సునీతకుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ శైలజ, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి అండర్–20 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వంద మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లా అథ్లెట్లు రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి ఈప్రాంత పేరు నిలబెట్టాలన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రాజేశ్ మాట్లాడుతూ, జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 15,16తేదీల్లో హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయిపోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జ్యోతిశ్వరన్, పీడీలు, పీఈటీలు సందీప్, అలివేలుమంగ, రాకేశ్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ కుటుంబమే బాగుపడింది

- బీజేపీ ఓబీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సంజయ్ ఘూనాటే



కాలనీవాసులతో మాట్లాడుతున్న సంజయ్

ఆదిలాబాద్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబం తప్ప ఏ ఒక్కరూ బాగుపడలేదని బీజేపీ ఓబీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సంజయ్ ఘూనాటే అన్నారు. జిల్లా కేంద్రంలోని కోలిపురా కాలనీలో బుధవారం నిర్వహించిన ఘర్ ఘర్ చలో–గావ్ గావ్ చలో అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఓబీసీల సంక్షేమానికి చేస్తున్న కృషిని వివరించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రతీ ఇంట్లోనూ సమస్యలు దర్శనమిస్తున్నాయన్నారు. ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. స్వరాష్ట్రంలో సాధించుకున్న ఫలాలు కేవలం కేసీఆర్ కుటుంబానికే దక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సువాసిని రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్, జ్యోతి రెడ్డి, జోగు రవి, ధోని జ్యోతి, మయూర్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



కుటుంబ సభ్యులకు బిడ్డను అందిస్తున్న ఈఎంటీ సతీశ్

బజార్‌హత్నూర్: మండలంలోని ఏసాపూర్ గ్రామానికి చెందిన గెడం దేవిక బుధవారం ఉదయం పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతుండటంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకవెళ్తుండగా మార్గమధ్యలో గులాబ్‌తాండ గ్రామ సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ రామెల్లి సతీష్, పైలెట్ నరేందర్‌లు గర్భిణికి పురుడు పోశారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించినట్లు తెలిపారు.

ఆత్మహత్య కేసులో ఇద్దరి రిమాండ్

నార్నూర్: మండలంలోని సుంగాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ ఐశ్వర్య (20) వరకట్నం వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రేంకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుంగాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ బాలాజీ, జ్యోతి దంపతుల కూతురు జాదవ్ ఐశ్వర్యను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీచర్‌కాలనీకి చెందిన బండారి మహేశ్‌తో గతేడాది 03/02/2022 పెళ్లి చేశారు. ఆమెకు భర్తతో పాటు అత్త, మామలు వరకట్నం వేధింపులకు గురిచేయడంతో ఈ నెల 04న సుంగాపూర్ గ్రామంలోని తల్లి ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. మృత్యురాలి తల్లి జాదవ్ జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న బండారీ మహేశ్, బండారీ రామరారావును బుధవారం అరెస్టు చేసి డీఎస్పీ నాగేందర్ సమక్షంలో ఉట్నూర్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి అనంతరం రిమాండ్‌కు తరలించారు.

టీఎస్ఆర్‌జేసీ సెట్-2023కు దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం: 2022–23 పదో తరగతి విద్యార్థుల నుంచి టీఎస్ఆర్‌జేసీ సెట్-2023కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ నీరడి గంగాధర్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ కార్యదర్శి సీహెచ్ రమణకుమార్ ఆదేశాల మేరకు ఈ ప్రకటన విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశం పొందచ్చని, అర్హులైన అభ్యర్థులు ఈనెల 15 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్ష మే 6వ తేదీన ఉమ్మడి ఆదిలాబాద్ ప్రధాన కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ http://tsrjcdc.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు 040-24734899 సంప్రదించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ అప్పి, టేకోవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 94630 26237. [T-1801]

WANTED

■ HYDలో అర్జంటుగా సెక్యూరిటీ గార్డ్స్, RTC కార్గో బస్‌లకు బాయ్స్, అటెండర్స్ కావలెను. (కన్సల్టెన్సీ కాదు) మంచి జీతం: వసతి కలదు. సంప్ర: 040-66366664, 9392663777, 9246663777 [HA-1330]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

భూసారంతో దిగుబడి

- భూసార పరీక్షలతో రైతుకు ప్రయోజనం
- తగ్గనున్న ఎరువుల వినియోగం
- అవగాహన లేమితో రైతులు వెనుకంజ



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

బోథ్: వ్యవసాయ క్షేత్రాలు ఏ రకమైన పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయి.. భూమిలోని పోషకాల స్థాయి.. ఎలాంటి ఎరువులు ఏ సందర్భాల్లో ఉపయోగించాలనే విషయాలపై రైతులకు అవగాహన కలగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. సరైన సమయంలో వర్షాలు పడకపోవడం, ప్రకృతి అనుకూలించకపోవడంతో రైతులు ప్రతి ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో భూసార పరీక్షలు నిర్వహించి వాతావరణ పరిస్థితులకు తగిన పంటలను సాగుచేస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని నిపుణులంటున్నారు.

జిల్లాలో పరిస్థితి..

ఆదిలాబాద్ జిల్లాలో 101 క్లస్టర్లు ఉన్నాయి. వాటి పరిధిలో దాదాపు 5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. జిల్లాలో సుమారు రెండు లక్షల మంది రైతులు ఉన్నారు. ఏటా వర్షాకాలం, యాసంగిలలో పత్తి, పెసర, మినుము, జొన్న, మొక్క జొన్న, సెనగ, కంది తదితర పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఎరువులు ఎంత మోతాదులోవాడాలి, భూమి ఏ పంటలకు అనుకూలంగా ఉందో తెలియక పోవడంతో దిగుబడి రావడం లేదు. ఫలితంగా అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

అవగాహన లేమితో వెనుకంజ...

అన్నదాతలు పంటల సాగుపై దృష్టి పెడుతున్న విధంగా భూమిలోని పోషకాల స్థాయి తెలుసుకోవడంలో వెనకపడుతున్నారు. విరివిగా రసాయన ఎరువుల వాడకంతో సాగు వ్యయం పెరగడంతో పాటు భూమిలో పోషక విలువలు తగ్గుతున్నాయి. నేల స్వభావం తెలియక అవసరానికి మించి క్రిమి సంహారక మందులు వినియోగిస్తున్నారు. భూసార పరీక్షలపై సదస్సులు, సమావేశాల్లో వ్యవసాయాధికారులు చెబుతున్నా రైతులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. భూసార పరీక్షల ఫలితాలను అధికారులు సమయానికి అందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫలితాల ఆధారంగా..

భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాలను అనుసరించి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. భూసార పరీక్షల ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లోని ఉదజని, లవణ సూచిక పోషకాలు, నత్రజని, భాస్వరం, పొటాష్‌ల లభ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా అవసరమైన మోతాదులో ఎరువుల వినియోగానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ పరిశోధన కేంద్రాలను ఆశ్రయించి వారు సూచించిన వంగడాలను ఉపయోగిస్తే దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

భూసార పరీక్షలకు అధికారులను సంప్రదించాలి



రైతులు తమ భూమికి సంబంధించిన భూసార పరీక్షలను ప్రతి ఏటా చేయించుకోవాలి. భూసార పరీక్షలతో భూమి సారం తెలుస్తుంది. భూమికి కావాల్సిన పోషకాలు ఇవ్వగలిగే అవకాశం ఉంది. ఏప్రిల్, మే నెలలో భూసార పరీక్షలను చేయించుకోవాలి. ఇందుకు ఆయా క్లస్టర్లలోని వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా నేరుగా వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలి. ఉచితంగా భూసార పరీక్షల చేస్తాము. వారం రోజుల్లో భూసార పరీక్షలకు సంబంధించి రిపోర్టులు వస్తాయి. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలి. – వెండి విశ్వామిత్ర, వ్యవసాయధికారి, బోథ్

అటవీశాఖ అధికారులపై దాడి

- అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత
- ట్రాక్టర్‌ను తీసుకెళ్లకుండా బంధువులతో కలిసి యజమాని అడ్డగింత
- స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఆర్వో ఫిర్యాదు



ట్రాక్టర్ తీసుకెళ్లకుండా అడ్డుకుంటున్న యజమాని, అతడి బంధువులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ టైగర్‌జోన్ అటవీ పరిధిలో బుధవారం మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారి వాహబ్ అహ్మద్ సిబ్బంది కలిసి పట్టుకున్నాడు. ఆ ట్రాక్టర్‌ను ఇచ్చోడలోని అటవీశాఖ కార్యాలయానికి తరలిస్తుండగా ట్రాక్టర్ యజమానితో పాటు అతడి బంధువులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ట్రాక్టర్ కదలకుండా దాని ఎదుట బైఠాయించారు. అధికారులు వారిని తొలగించే క్రమంలో ఎఫ్ఆర్వో వాహబ్ అహ్మద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో అతడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి హామీ సిబ్బందికి పే స్కేల్ వర్తింపజేయాలి

- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర జేఏసీ డిమాండ్



మాట్లాడుతున్న బాపురావు, సచిన్ జాదవ్

నార్నూర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో శిక్షణ పొందిన అర్హత గల ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర జేఏసీ కమిటీ సభ్యులు బాపురావు, జాదవ్ సచిన్ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3872 మంది శిక్షణ పొందిన అర్హులు ఉద్యోగస్తులుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి శాఖలో 17ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిపైన ఎఫ్ఏలు, టీఏలు, ఈసీలు, ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, బీఎఫ్‌టీలుగా పని చేస్తున్నారన్నారు. డీఆర్‌డీఏలో ఒకేగొడుగు కింద ఐకేపీ ఉద్యోగస్తులతో సమానంగా పని చేస్తున్నారని, ప్రభుత్వం ఐకేపీ సిబ్బందికి పే స్కేల్ వర్తింపజేస్తూ జీవో జారీ చేసిందని, అదే గొడుకు కింద పనిచేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగస్తులను మాత్రం విస్మరించిందన్నారు. ఐకేపీ ఉద్యోగస్తులకు వర్తింపజేసిన పే స్కేల్‌ను ఉపాధి హామీ సిబ్బందికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు జాదవ్ కైలాస్‌నాయక్, జ్యోతి, సురేశ్, సాధిక్ ఉన్నారు.

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉట్నూర్: సమాజ శ్రేయస్సు కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ, జయంతి మహోత్సవాలు ఈ నెల 14వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో చలో పాచ్చెర కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన మహనీయులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 14వ తేదిన మహాత్మ జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రాం, కుమురంభీం విగ్రహాలను పాచ్చెరలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో పాటు ఇతర ముఖ్య నాయకులు హాజరు అవుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొమ్ము రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాం ప్రసాద్, నాయకులు గణేశ్ గౌడ్, కేశవ్ ఉన్నారు.

పిడుగుపాటుకు నాలుగు పశువులు మృత్యువాత



మృతిచెందిన పశువులు

బేల: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని భవానీగూడ(సి) గ్రామానికి చెందిన ఆదివాసీ రైతు ఆత్రం శంకర్‌కు చెందిన నాలుగు పశువులు పిడుగుపాటుతో మృతిచెందాయి. మంగళవారం సాయంత్రం పశువులను తీసుకుని గ్రామానికి 5కిలో మీటర్ల దూరంలోని అటవీ ప్రాంతం వైపు ఉన్న పొలంకు వెళ్లాడు. చీకటి పడే క్రమంలో పశువులను ఇంటికి తీసుకొస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో శంకర్ పశువులను వదిలేసి పక్కనున్న గుడిసెలోకి వెళ్లి తలదాచుకున్నాడు. ఈ క్రమంలో పశువుల్లో సమీపంలోని చెట్టు కిందకు వెళ్లాయి. చెట్టుపై పిడుగుపడడంతో రెండు ఆవులు, రెండు లేగదూడలు మృతిచెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

పట్టుబడిన వాహనాలకు వేలం



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడ్డ వాహనాలకు బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ సాయిధ దళ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో 41ద్విచక్ర వాహనాలను రెండు విభాగాలు విభజించి వేలం నిర్వహించగా రూ.2లక్షల 11వేల ఆదాయం సమకూరింది. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడ్డ వాహనాలు తీసుకువెళ్లేందుకు ఆరు నెలలుగా ఎవరూ రాకపోవడంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించినట్టు ఎస్పీ తెలిపారు. ఈ వేలం పాటకు కమిటీ సభ్యులుగా అదనపు ఎస్పీ (ఏఆర్) వెంకటేశ్వర్లు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎంటీవో వినోద్‌లను నియమించారు.

విద్యుత్ తీగలు చోరీ

తానూరు: భైంసా నుంచి ఎల్వి గ్రామానికి ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ తీగలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా –మచ్కల్ మీదుగా తానూరు మండలానికి రెండేళ్ల క్రితం అదనంగా 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేస్తుండగా మచ్కల్ గ్రామ సమీపంలో గ్రామస్తులు 33 కేవీ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఈ తీగలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో మంగళవారం రాత్రి హంగిర్గా గ్రామ సమీపంలో రెండు స్తంభాలకు సంబంధించిన విద్యుత్ తీగలను దొంగిలించారు. విషయం తెలుసున్న విద్యుత్ ఏఈ ప్రదీప్ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

సదల్‌పూర్ ఆలయాల సందర్శన

బేల: మండలంలోని సదల్‌పూర్ గ్రామ శివారులోని ప్రాచీన ఆలయాలైన బైరందేవ్, మహాదేవ్ ఆలయాలను బుధవారం పురావస్తు శాఖ అధికారి సాయికృష్ణ సందర్శించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన ఆలయాల పరిస్థితితో పాటు ఆలయాల ప్రత్యేకతపై ఆ అధికారికి వివరించారు. దీనిపై ఆ శాఖ ఉన్నతాధికారులకు నివేదించి, ముందుగా బైరందేవ్ ఆలయ పునర్మిణానికి కృషి చేస్తానని తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాత్రే గంభీర్, సతీష్ పవార్ ఉన్నారు.

ఉన్నత విద్య సమీక్షలో ఆర్జీయూకేటీ వీసీ



సమావేశంలో ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ

భైంసా: హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నత విద్యా కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్నత విద్యాసంస్థల స్టాండర్డైజేషన్, ట్రాన్స్ఫర్మేషన్ అండ్ ఎక్సలెన్స్ ప్రాజెక్ట్ (హై–స్టెప్)పై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ యూనివర్సిటీల వీసీలతో పాటు బాసర ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ హాజరయ్యారు. వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థలో వినూత్న బోధన ప్రక్రియలను అభ్యాస వాతావరణాన్ని నిర్ధారించడం ద్వారా నాణ్యమైన విద్యను అందించవచ్చన్నారు. అధ్యాపకుల సామర్థ్యాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం విద్యావ్యవస్థలో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు. అలాగే మరిన్ని అంశాలపై చర్చించారు.

యువకుడి బలవన్మరణం



కట్ల మల్లికార్జున్ (ఫైల్)

ఖానాపూర్: మండలంలోని గోడలపంపు గ్రామానికి చెందిన కట్ల మల్లికార్జున్ (25) గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడని ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. ఎనిమిది నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మల్లికార్జున్ ఆస్పత్రిలో పలుమార్లు చూపించుకున్న తగ్గలేదు. ఈ నెల 10న తీవ్ర కడుపు నొప్పిరావడంతో పంట చేనులోని గడ్డిమందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు హుటాహుటిని స్థానిక ఆస్పత్రి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధనోరా ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించిన ఎన్‌క్వాస్

- వసతులపై ఆరా తీసిన సభ్యులు



ధనోరా ఆరోగ్య ఉపకేంద్రం వద్ద వైద్య సిబ్బందితో ఎన్‌క్వాస్ బృందం సభ్యులు

తాంసి: భీంపూర్ మండలంలోని ధనోరా గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం ఎన్‌క్వాస్ (జాతీయ నాణ్యత ప్రమాణాల హామీ బృందం) సభ్యులు పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో అందిస్తున్న వైద్యసేవల పరిశీలనలో భాగంగా నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ బృందం సభ్యులు డా.ఇందిర, డా.మంజుల తనిఖీ చేసి వైద్యసేవలను పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రంలోని వెల్‌నెస్ సెంటర్ ద్వారా అందుతున్న వైద్య సేవలను వైద్య సిబ్బందికి, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వైద్యానికి సంబంధించిన వివిధ రికార్డుల నిర్వహణ, రిపోర్టులను పరిశీలించారు. 14 రకాల జాతీయ వైద్యసేవ కార్యక్రమాల నిర్వహణతో పాటు గర్భిణులకు పరీక్షలు తదితర వాటిపై ఆరా తీశారు. పరిశుభ్రత పచ్చదనాన్ని పరిశీలించారు. తదితర రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట జిల్లా క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ అమర్‌నాథ్, భీంపూర్ వైద్యాధికారి విజయ సారథి, నిఖిల్‌రాజ్, సూపర్‌వైజర్ గంగాధర్, ఆరోగ్య విస్తీర్ణాధికారి జ్ఞానేశ్వర్, ఏఎన్ఎంలు సరస్వతి, సుజాత, ఫార్మాసిస్ట్ రాందాస్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



కొత్తకాపు భోజన్న(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన కొత్త కాపు భోజన్న (35) అదృశ్యమైనట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను తెలిపారు. భోజన్న స్థానికంగా దుకాణం నిర్వహిస్తుండగా ఈ నెల 5న దుకాణానికి వెళ్తున్నానని భార్య గంగామణికి చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం కానరాలేదు. దీంతో బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పురుగుల మందుతాగి హోంగార్డు ఆత్మహత్య

గుడిహత్నూర్: పురుగుల మందుతాగి హోంగార్డు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో బుధవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామానికి చెందిన రాజేశ్వర్ రావు (58) నిర్మల్‌లోని పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు ఆరా తీయగా విధులకు హాజరు కాలేదని తోటి సిబ్బంది తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని వాకబ్ చేసినా ఆచూకీ తెలియరాలేదు. అయితే బుధవారం సాయంత్రం గుడిహత్నూర్ మండలంలోని సీతాగోంది గ్రామ సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కనే గల పంట చేనులో మృతదేహం కనిపించడం ఓ రైతు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు చేరుకుని రాజేశ్వర్‌రావుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బెల్లంపల్లిలో ముగ్గురికి కరోనా

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో కరోనా వైరస్ కలకలం రేపింది. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో దగ్గు, జ్వరం, గొంతునొప్పితో బాధపడుతున్న 14 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి కోవిడ్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. మంగళవారం నిర్వహించిన పరీక్షల్లో బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లికి చెందిన ఒకరికి పాజిటివ్ వచ్చింది. సదరు వ్యక్తులకు వైద్య సలహాలు ఇచ్చి హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. కరోనా పాజిటివ్ కేసులు బయట పడటంతో ప్రజల్లో ఒక్కసారిగా భయాందోళనలు మొదలయ్యాయి.

కడెం ప్రాజెక్ట్‌కు సిబ్బంది కొరత

- ఉన్నవారిపై పనిభారం
- ఇటీవల ప్రమాదవశాత్తు లస్కర్ మృతి



కడెం ప్రాజెక్ట్ (ఫైల్)

కడెం: కడెం ప్రాజెక్ట్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది. పూర్తి స్థాయి సిబ్బంది లేక ప్రాజెక్ట్ నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఉన్న అరకొర సిబ్బందిపైనే పనిభారం పడుతోంది. ప్రాజెక్ట్ సిబ్బంది ఉద్యోగ విరమణ తప్ప నియామకాలు లేకపోవడంతో సమస్య ఏటా తీవ్రమవుతోంది.

గేటు తీసేవారే లేరు..

కడెం ప్రాజెక్ట్‌లో సిబ్బంది లేక ఏళ్లుగా అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభంలో ఆయా విభాగాల్లో నీటి పారుదల శాఖ నియమించిన సిబ్బందే.. తప్ప నూతన నియామకాలు చేపట్టలేదు. దీంతో గతంలో నియామకమైన ఉద్యోగులు విరమణతో క్రమక్రమంగా సిబ్బంది తగ్గుతూ వస్తున్నారు. కాల్వలకు నీటి విడుదల, గేట్ల నిర్వహణ ప్రస్తుతం ఉన్న ఉద్యోగులపైనే పడుతోంది. కాల్వలకు నీటిని విడుదల చేయాల్సిన కిందిస్థాయి సిబ్బంది లేక ఏఈలు సైతం లస్కర్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి ప్రవేశానికి గేటు తీయాల్సిన సిబ్బంది లేక వర్క్ ఇన్‌స్పెక్టర్లు గేటు దగ్గర కాపలా ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

భద్రత లోపాలు..

కడెం ప్రాజెక్ట్‌పై భద్రత లోపాలు ఓ ఉద్యోగి మృతితో వెలుగులోకి వచ్చాయి. ఈ నెల 8వ తేదీన ప్రాజెక్ట్‌పై లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్న గంగాధర్ వరద గేట్ల నుంచి లీకేజీ నీటిని అరికట్టేందుకు మరమ్మతులు పూర్తి చేసి గేటు పైకి ఎక్కే క్రమంలో నిచ్చెన జారీపోవడంతో 50 మీటర్ల ఎత్తు నుంచి పడి మృతి చెందాడు. సాధారణంగా ప్రాజెక్ట్ మరమ్మతు పనులు చేసే సమయంలో కనీసం ఏఈ స్థాయి అధికారి ఉండి పనులు పర్యవేక్షించాలి. మరోవైపు ప్రాజెక్ట్ మరమ్మతులు చేసే సిబ్బంది సేఫ్టీ కోసం బాడీ బెల్ట్‌లు ధరించాలి. అవేమి లేకుండానే లస్కర్ గంగాధర్ పనులు చేయడంతో మృతికి కారణమైంది. ఈ విషయమై ఉన్నతాధికారులను సంప్రదించగా అధికారులు అంతా కాలువల నిర్వహణ పనుల్లో బిజీగా ఉన్నారని, ఇవి రోజు వారీగా చేసే పనులేనని, ప్రమాదవశాత్తు ఈ సంఘటన జరిగిందని చెప్పడం గమనార్హం.

ఉద్యోగం	మొత్తం	ప్రస్తుతంఉన్నవారు
వర్క్‌ఇన్‌స్పెక్టర్లు	17	06
ఎలక్ట్రీషియన్	02	0
ఫిట్టర్	02	0
గేటు ఆపరేటర్	00	00
పంప్ ఆపరేటర్లు	00	00
వర్క్ ఇన్‌స్పెక్టర్లు	78	11

ప్రతిపాదనలు పంపించాం...

గత కొన్నేళ్లుగా ప్రాజెక్ట్‌పై సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఈ విషయమై గతంలో పలుమార్లు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించాం. సీఎం కేసీఆర్ ప్రకటించినట్లు రెవెన్యూ శాఖలో తొలగించిన వీఆర్వోలను ఇరిగేషన్‌కు కేటాయిస్తే సిబ్బంది కొరత తీరనుంది.
– రాజశేఖర్‌గౌడ్, ఈఈ, కడెం ప్రాజెక్ట్